

జిల్లా ఎన్నికల పరిశీలకులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

# ఎన్నికల సిబ్బందికి భద్రత కల్పించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేటసిటీ, నవంబర్ 22 ః ఎన్నికల సామగ్రికి, ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పటిష్ఠ భద్రత కల్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోలీస్ బందోబస్తు, యాక్షన్ ప్లాన్‌పై బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్నికల జనరల్ పరిశీలకులు, ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని నిబంధనల ప్రకారం అర్మ్‌డ్ సిబ్బందిని కేటాయించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గల ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది కేటాయింపు, కమ్యూనికేషన్, సమన్వయం చాలా ముఖ్యమన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలించినట్లు తెలిపారు. సిబ్బంది కేటాయింపు, యాక్షన్ ప్లాన్‌ను ఎన్నికల పరిశీలకులకు వివరించారు. సమావేశంలో పోలీస్ పరిశీలకులు డీఐజీ పర్వత్ అబ్బాస్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల జనరల్ పరిశీలకులు కౌశికన్, సూర్యాపేట తుంగతుర్తి నియోజక వర్గాల జనరల్ పరిశీలకులు బాలకిషన్ ముండా, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం

నూతనకల్, నవంబర్ 22 : మండలంలోని తాళ్ల సింగారం గ్రామానికి చెందిన ముశం సావిత్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులను బుధవారం గ్రామ సర్పంచ్ చూడి లింగారెడ్డి పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. అలాగే బీఆర్‌ఎస్ మండల నాయకుడు పన్నాల సైదిరెడ్డి రూ.5 వేల అందజేశారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు నిరుపేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మరికంటి పరమేశ్, వార్డు సభ్యులు యాదగిరి, గట్టయ్య, లింగయ్య, గురువయ్య, సత్తయ్య, యల్లయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్

# మాదిగలంతా బీఆర్‌ఎస్‌కు ఓటేసి రుణం తీర్చుకోవాలి

- ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్

ఆలేరు, నవంబర్ 22 : ఎస్సీ వర్గీకరణ కోసం చనిపోయిన అమరుల కుటుంబాలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, మాదిగలంతా కారు గుర్తుకు ఓటేసి రుణం తీర్చుకోవాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్, ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిలుకమర్రి గణేశ్‌మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో నిరంతర అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. మాదిగల పట్ల సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఆలేరు మండల కేంద్రంలో ఈనెల 26న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కుమ్మరికుంట్ల గణేశ్, గ్యదపాక మల్లేశ్, గంగాపురం రాములు, పరశురాములు, నత్తి కృష్ణ, గ్యార నరేశ్, మీసాల ఉప్పలయ్య, ఎర్ర విజయ్, వంగపల్లి ఉప్పలయ్య, గొల్లూరి ప్రభాకర్, అందె సుధాకర్, రవి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

మోటకొండూర్, నవంబర్ 22 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఐఏఎస్ అధికారి, ఎన్నికల పరిశీలకుడు మహేశ్వరన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ శాంతిలాల్,

ఎంపీడీఓ వీరస్వామి, ఎస్ఐ తేజంరెడ్డి పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బొక్కబోర్లా..

- తుస్సుమన్న మల్లిఖార్జున ఖర్గే మీటింగ్
- ఖాళీ కుర్చీలతోనే కొనసాగిన ఖర్గే ప్రసంగం
- జనం లేక ప్రసంగానికి ముఖం చాటేసిన కోమటిరెడ్డి
- బీఆర్‌ఎస్ సభకు ధీటుగా అంటూ నవ్వులపాలు
- కేసీఆర్ మీటింగ్‌కు.. ఖర్గే మీటింగ్‌కు అస్మాన్ ఫరాక్
- కోమటిరెడ్డి ప్రగల్భాలతో నైరాశ్యంలో కాంగ్రెస్ శ్రేణులు




ఈ నెల 20న నల్లగొండలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున హాజరైన జనజన సందోహం (ఫైల్)

నల్లగొండ ప్రతినిధి, నవంబర్22(నమస్తే తెలంగాణ) : సాధారణంగా ఒక పార్టీ అధినేతనో.. మరో ముఖ్య నేతనో ఒక అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటున్నాడంటే అది మరింత ఊపునిచ్చేదిగా ఉండాలి. విజయానికి ఎంతోకొంత దోహద పడాలి. పార్టీ శ్రేణుల్లోనూ ఉత్తేజాన్ని నింపాలి. కానీ నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ రోడ్డులో సోమవారం బీఆర్‌ఎస్ నిర్వహించిన సభాస్థలంలో అదే వేదిక మీద, అవే గ్యాలరీల నడుమ కోమటిరెడ్డి బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రజా భరోసా సభ అట్టర్ ప్లాపైంది. ఈ సభకు జనాన్ని ఓ మాదిరిగా తరలించినా అసలు సమయానికి సభా ప్రాంగణం ఖాళీ కావడంతో తలలు పట్టుకోవడం కాంగెస్ శ్రేణుల వంతైంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డికి మద్దతుగా కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయిన విషయం తెలిసిందే. సీఎం కేసీఆర్ ప్రసంగం ముగిసే వరకు జనం కదలకుండా అలాగే శ్రద్ధగా ఆలకించారు. బీఆర్‌ఎస్ సభకు మధ్యాహ్నం 3 గంటలకే తరలివచ్చిన జనం సాయంత్రం 5.18 గంటలకు సభ ముగిసే వరకు ఎక్కడ కూర్చున్న వాళ్లు అక్కడే కదలకుండా శ్రద్ధగా కేసీఆర్ ప్రసంగాన్ని ఆసాంతం ఆలకించారు. ఈ సభకు భారీగా జనం హాజరు కావడంతో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విజయం ఖాయమన్న చర్చ సర్వత్రా మొదలైంది. దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేని ఆడంబరాలకు పోయి బీఆర్‌ఎస్ నిర్వహించిన సభా స్థలంలోనే బుధవారం ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గేతో బహిరంగ సభకు సిద్ధమయ్యారు. ఈ ప్రజా భరోసా సభకు మల్లిఖార్జున ఖర్గేతో పాటు రాష్ట వ్యవహారాల ఇన్‌చార్జి మణిక్‌రావుఠాక్రే, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరైనా జనం నుంచి స్పందన కరువైంది. ముఖ్య అతిథిగా వచ్చిన మల్లిఖార్జున ఖర్గే ప్రసంగానికి ముందే జనం లేచి వెళ్లిపోయారు. ఆయన ప్రసంగం ప్రారంభించే సమయానికే సభా ప్రాంగణం దాదాపుగా ఖాళీ అయ్యింది. ఖర్గే ప్రసంగిస్తున్న సయమంలో జనం లేని సభ, ఖాళీ కుర్చీల వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారాయి. ఖర్గే సుమారు 25 నిమిషాల సమయం ప్రసంగానికి తీసుకోగా దాని తెలుగు అనువాదానికి మరో 15 నిమిషాలు పట్టింది. మొత్తం 40 నిమిషాల పాటు ప్రసంగం, దాని తెలుగు అనువాదం కొనసాగి పూర్తయ్యే సమయానికి సభా ప్రాంగణం పూర్తిగా ఖాళీ అయ్యింది. అక్కడక్కడా కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే సభలో మిగిలారు. సభలో జనం వెళ్లిపోతుండడాన్ని గమనిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాణిక్‌రావు ఠాక్రేతో ఖర్గే వైపు చూస్తూ తల పట్టుకోవడం కనిపించింది. కొసమెరుపు ఏటంటే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ మల్లికార్జున ఖర్గే మాట్లాడిన అనంతరం తాను 10 నిమిషాల పాటు నియోజకవర్గ అభివృద్ధిపై తన ప్రణాళికను ప్రకటిస్తానని చెప్పారు. కానీ తీరా ఖర్గే ప్రసంగం ముగిసే సరికే సభలో ఖాళీ కుర్చీలే మిగలడంతో వెంకట్‌రెడ్డి తన మ్యానిఫెస్టోను కూడా ప్రకటించలేకపోయారు. రెండు రోజుల తేడాతో జరిగిన బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభ, కాంగ్రెస్ వెలవెలబోయిన సభ జనంలో చర్చనీయాంశంగా మారింది. లేని ఆడంబరానికి పోయి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటమిని ముందే ఖరారు చేసుకున్నాడన్న ఛలోక్తులు మొదలయ్యాయి.

# శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు

- యాదగిరిగుట్టలో కార్తీక దీపారాదన

యాదగిరిగుట్ట, నవంబర్ 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. బుధవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతు జరిపారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠ మూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. ప్రధానాలయంతో పాటు అనుబంధ రామలింగేశ్వరాలయంతో కార్తీక దీపారాదనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు. తెల్లవారుజూమూ నుంచే మహిళలు 365 ఒత్తులతో కూడిన దీపాలను వెలిగించి పూజల్లో పాల్గొన్నారు. కొండకింద వ్రత మండపంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానకు రూ. 18,17,118 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.



స్వామివారి కల్యాణం జరుపుతున్న అర్చకులు

## 27న కార్తీక జల దీపోత్సవం

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 22 : ఈనెల 27న పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి జల దీపోత్సవం నిర్వహించనునట్లు లక్ష్మీనారాయణస్వామి భజన మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల మహేశ్, బోడ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనితారెడ్డి, ప్రముఖ సినీ నటి ఆమని హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.